నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 23 అక్టోబర్ 2024 | SIDDIPET

## ఎమ్మెల్యేను కలిసిన 'లవ్‌రెడ్డి' చిత్ర బృందం


జనగామ ఎమ్మెల్యే పల్లాతో లవ్‌రెడ్డి చిత్ర బృందం

చేర్యాల, అక్టోబర్ 22: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం 'లవ్ రెడ్డి' చిత్ర డైరెక్టర్ స్మరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో హీరో, హీరోయిన్లు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి లవ్‌రెడ్డి చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సందేశాత్మక సినిమాలు తీయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హీరో అంజన్‌రామచంద్ర, హీరోయిన్ శ్రావణిరెడ్డి, బీఆర్‌ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండలాల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, మలిపెద్ది మల్లేశం, చొప్పరి సా గర్ తదితరులు ఉన్నారు.

## జల దిగ్బంధంలో ఏడుపాయల దుర్గమ్మ


జల దిగ్బంధంలో ఏడుపాయల దుర్గమ్మ ఆలయం

పాపన్నపేట అక్టోబర్ 22: మెదక్ జిల్లా ఏడుపాయల దుర్గమ్మ ఆలయం మంగళవారం జల దిగ్బంధంలో చిక్కుకుంది. సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో మంజీరా నదిలో వరద పారుతున్నది. సింగూరు నుంచి వస్తున్న వరదతో ఘన్‌పూర్ ఆనకట్ట నిండి పొంగిపొర్లుతున్నది. దీంతో ఏడుపాయల దుర్గమ్మ ఆలయాన్ని మూసివేశారు. భక్తులు మంజీర నది వైపు వెళ్లకుండా ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం రాజగోపురంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శంకరశర్మ, పార్తివశర్మ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

# పత్తి రైతు పరేషాన్

## వర్షాలకు సంగారెడ్డి జిల్లాలో ఏడువేల ఎకరాల్లో దెబ్బ తిన్న పంట

- ఎండుతెగులుతో మరింత పంట నష్టం
- అధిక వర్షాలు, తెగుళ్లతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం
- పత్తి మద్దతు ధరపైనా రైతుల్లో తీవ్ర అసంతృప్తి
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం తాత్సారం



సంగారెడ్డి, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ): తెల్లబంగారం తెల్లబోతున్నది. అధిక వర్షాలు, తెగుళ్లు పత్తి రైతులను నష్టాల బాటపట్టిస్తున్నాయి. వర్షాలతో ఓవైపు పంటనష్టం జరగగా, తెగుళ్ల కారణంగా పంటలు ఎండిపోయి పత్తి రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. తెగుళ్లు, అధిక వర్షాలతో పంట దిగుబడిపైనా తీవ్ర ప్రభావం పడుతున్నది. సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో పత్తి సాగుచేస్తే 12 క్వింటాళ్లు అంతకు పైన దిగుబడి వస్తుంది. ప్రస్తుతం జిల్లాలో అంత దిగుబడి వచ్చేలా కనిపించడం లేదు. పంట దిగుబడి తగ్గడంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తున్నది. పంటదిగుబడి తగ్గినా మద్దతు ధర పెరుగుతుందని పత్తి రైతులు ఆశపడ్డారు. కేంద్ర సర్కారు ఆశించిన స్థాయిలో పత్తి మద్దతు ధర ప్రకటించలేదు. క్వింటాల్ పత్తికి రూ.7521 మద్దతు ధర ప్రకటించడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. దీనికి తోడు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశాలు కనిపించడం లేదు. సీసీఐ పత్తి కొనుగోలు చేయలేని పక్షంలో ధర విషయంలో రైతులు మరింత నష్టపోయే అవకాశం ఉంది. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా ఏటా పత్తి సాగుచేస్తారు. ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం 4 లక్షలు చేరుకుంటుందని అంచనా వేశారు. వానకాలం ఆరంభంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేశారు. గతేడాది కం టే ఈసారి విస్తీర్ణం తగ్గింది. పత్తిపంట బాగా ఎదిగే దశలో గత నెలలో భారీ వర్షాలు, వరదలతో పంటకు భారీ నష్టం వాటిల్లింది. సంగారెడ్డి జిల్లాలో 7వేల ఎకరాల వరకు పత్తి పంటకు నష్టం వాటిల్లింది.పత్తి ఎక్కువగా సాగుచేసే మునిపల్లి, సదాశివపేట, రాయికోడ్, న్యాల్‌కల్, సంగారెడ్డి, వట్‌పల్లి, జహీరాబాద్, చౌటకూరు, నారాయణఖేడ్, పుల్కల్, వట్‌పల్లి మండలాల్లో పత్తి పంట ఎక్కువగా దెబ్బతిన్నది. అధికారులు మాత్రం 3367 ఎకరాల్లో మాత్రమే పత్తి పంటకు నష్టం వాటిల్లిందని, ఇందులో 1290 ఎకరాల్లో మాత్రమే 33శాతానికి పైగా పంటనష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. పంటనష్ట పరిహారంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అధికారులు పంట నష్టాన్ని తక్కువగా చూపి ప్రభుత్వానికి నివేదిక పంపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు తెగుళ్లు సోకి మరింత నష్టం జరిగింది. ఎండుతెగులు కారణంగా పత్తి చెట్లు, కాయలు ఎర్రగా మారి ఎండిపోయి దిగుబడి గణనీయంగా తగ్గుముఖం పట్టింది. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. ఈ సీజన్‌లో 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్ర మే వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పంటనష్టం జరగడం, దిగుబడి తగ్గ టం, మద్దతు ధర తక్కువగా ఉం డడం పత్తి రైతులకు శరాఘాతంగా మారింది. పెట్టుబడుల డబ్బులు సైతం వచ్చే అవకాశాలు లేవని రైతులు వాపోతున్నారు.

# దళారుల బారిన పత్తి రైతు

## మెదక్ జిల్లాలో 36,143 ఎకరాల్లో పత్తి సాగు

మెదక్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో పత్తి రైతులు పరేషాన్‌లో ఉన్నారు. జిల్లాలో ఈ సారి కురిసిన భారీ వర్షాలకు వందల ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. తెగుళ్లతో పంటకు మరింత నష్టం వాటిల్లింది. జిల్లాలో జిన్నింగ్ మిల్లులు లేకపోవడంతో పత్తి రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో పత్తిని అమ్ముకోవడానికి వస్తున్న రైతులకు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.6,500 కంటే ఎక్కువ ధర చెల్లించడం లేదు. తేమ పేరుతో దోపిడీ చేస్తున్నారని పత్తి రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో గతేడాది 38వేల ఎకరాల్లో పత్తి సాగుచేయగా, 34,522 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. వారి అంచనాలు తరుమారై 43,236 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. గతేడాది ఎంఎస్‌పీ ధర క్వింటాల్‌కు ఏ-గ్రేడ్ రూ.7,020 ఉండగా, బీ-గ్రేడ్ రూ.6,620 పలికింది. గతేడాది పత్తిని రైతులు వ్యాపారులకు విక్రయించాక జిల్లాలోని అల్లాదుర్గం మండలం రాంసానిపల్లిలో జిన్నింగ్ మిల్స్ ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించారు. దీంతో రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. ఈ ఏడాది కేంద్రం పత్తికి మద్దతు ధర పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏ-గ్రేడ్ పత్తి క్వింటాల్‌కు రూ.7,521గా నిర్ణయించింది. గతేడాదితో పోలిస్తే క్వింటాల్‌కు రూ.501 పెంచింది. తేమ శాతం 8 నుంచి 12కు మించకూడదని మార్కెటింగ్ శాఖ సూచిస్తున్నది. ఈసారి 36,143 ఎకరాల్లో పత్తి సాగు కాగా, 31,800 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ, భారీ వర్షాల కారణంగా దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మెదక్ జిల్లాలో వరి తర్వాత అత్యధికంగా పత్తి పండిస్తారు. జిల్లాలోని అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాల్లో పత్తి అధికంగా సాగు చేస్తారు. ఈసారి జిల్లాలో రెండు మిల్లులు ఏర్పాటు చేయగా, అందులో ఒక మిల్లును మాత్రమే నోటిఫై చేశారు. అది కూడా రైతులకు ఉపయోగపడడం లేదు. దీంతో రైతులు పత్తిని దళారులకు విక్రయించాల్సి వస్తున్నది.

## సీసీఐ కేంద్రాలు ప్రారంభమయ్యేనా..

### సిద్దిపేట జిల్లాలో 16 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసిన అధికారులు

గజ్వేల్, అక్టోబర్ 22: పత్తి కొనుగోళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా ఏర్పాట్లు చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.సిద్దిపేట జిల్లాలో ఈ వానకాలంలో 1.04 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి సాగుచేశారు. అధిక వర్షాలకు పంట భారీగా దెబ్బతిన్నది. 15 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఈసారి 16 జిన్నింగ్ మిల్లుల్లో మొదటి విడతలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలుకు అధికారులు నోటిఫై చేశారు. సీసీఐ అధికారులు ఎప్పుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి ఉంది. దసరా నాటికి రైతులు పంట చేన్ల నుంచి పత్తిని సేకరించడం ప్రారంభించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర అనుకూలంగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభిస్తే రైతులకు లాభం చేకూరుంది. లేకపోతే తక్కువ ధరకు రైతులు పత్తిని వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుంది.

### 16 మిల్లులు నోటిఫై చేశాం..

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలుకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 16 జిన్నింగ్ మిల్లులను మొదటి విడతలో నోటిఫై చేశాం. కొనుగోళ్లు ప్రారంభం కాగానే సక్రమంగా జరిగేలా చూస్తాం. విక్రయించేందుకు వచ్చే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తాం.

**- నాగరాజు, మార్కెటింగ్ అధికారి, సిద్దిపేట**


సిద్దిపేట జిల్లా రిమ్మనగూడలో పత్తి పంట


సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతుకు ఫిర్యాదు చేస్తున్న కల్‌బేమల్, బసంతపూర్ గ్రామస్తులు

## కరెంట్ కోతలపై జనాగ్రహం

### మెటల్‌కుంట సబ్ స్టేషన్ ముట్టడి

జహీరాబాద్, అక్టోబర్ 22: అప్రకటిత విద్యుత్ కోతలను ఆగ్రహిస్తూ సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం కల్‌బేమల్, బసంతపూర్ గ్రామస్తులు సోమవారం రాత్రి మెటల్‌కుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కరెంట్ సరిగ్గా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. విద్యుత్ కోతలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి ఫోన్లు చేసినా సరైన సమాధానం ఇవ్వడం లేదని, ఏఈ, లైన్‌మెన్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. వెంటనే ఏఈ, లైన్‌మెన్ సబ్‌స్టేషన్‌కు చేరుకోగా వారిని గ్రామస్తులు నిలదీశారు. ఉన్నతాధికారులు స్పందించి కరెంట్ కోతలు లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. విధులు సరిగ్గా నిర్వర్తించడం లేదని లైన్‌మెన్ ప్రవీణ్‌ను మండల అధికారులు ఉన్నతాధికారులకు సరెండర్ చేశారు. కాగా, తమ విధులకు కొందరు ఆటంకం కలిగించి, దుర్భాషలాడారని ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ హద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు సోమవారం హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ అధికారులపై జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు అధికారుల జోక్యంతో గ్రామస్తులు, ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదులకు ఉపసంహరించుకున్నారు.


మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సూరారంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి

- దెబ్బ తిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి
- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్

చిన్నశంకరంపేట/మెదక్ రూరల్, అక్టోబర్ 22: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనాలని, పంట దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్, చిన్నశంకరంపేట మండలాల్లో ఆమె పర్యటించారు. సూరారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం భాగీర్థిపల్లిలో నిర్వహించిన రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. అనంతరం చందంపేట సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. మెదక్ మండలంలోని ఔరంగాబాద్, ఔరంగాబాద్ తండా అవుసలపల్లిలో తడిసిన ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయకుంటే రైతుల తరఫున పోరాడుతామన్నారు. అనేక హామీలు ఇచ్చిన రైతులను కాంగ్రెస్ నిలువుగా మోసం చేసిందని ఆరోపించారు. రైతుబంధు వేస్తామని చెప్పి వేయకుండా మోసం చేసిందన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. బతుకమ్మ చీరలను అందించలేదన్నారు. ధాన్యం వస్తున్నా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం సేకరణలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట మండల నాయకులు లక్ష్మారెడ్డి, నాగరాజు, దయానంద్‌యాదవ్, లక్ష్మణ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ నాయకులు మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జగపతి, మెదక్ మం డలాధ్యక్షుడు అంజాగౌడ్, కౌన్సిలర్లు కిశోర్, జయరాజ్, రాజ్‌పల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

### సంగారెడ్డిలో చోద్యం చూస్తున్న అధికారులు


ప్రభుత్వ స్థలంలో పిల్లర్ల నిర్మాణానికి గుంతలు తీసిన కబ్జాదారులు

సంగారెడ్డి, అక్టోబరు 22: జిల్లాకేంద్రం సంగారెడ్డిలో ప్రభుత్వ స్థలం కనిపిస్తే కబ్జాదారులు కాకుల్లా వాలిపోతున్నారు. కాలనీ ఏదైనా డోంట్ కేర్ అంటూ కబ్జాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలనే కలెక్టర్ వల్లూరిక్రాంతి ఆదేశాలను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు విస్మరిస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్‌లో ఎంపీడీవో కార్యాలయం ఎదుట సర్వేనంబర్ 374కు పక్కన ప్రైవేట్ వెంచర్ ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నది. ప్రభుత్వ స్థలంలో ఏకంగా ఇంటి నిర్మాణానికి పిల్లర్ల గుంతలు తీశారు. ప్రస్తుతం మార్కెట్ ప్రకారం కబ్జాకు గురవుతున్న ఈ స్థలం గజానికి రూ.లక్ష ధర పలుకుతున్నదని రియల్ వ్యాపారులు చెబుతున్నారు. సుమారు1200 పైచిలుకు గజాల స్థలానికి రూ.12 కోట్లకు పైగా ధర పలుకుతుందని అంచనా. వెంచర్ చివరలో ఉన్న ఆరుగురు ఇండ్ల యజమానులు తమ ఇంటి ముందున్న ప్రభుత్వ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే తొలి ప్రయత్నంగా ఒక యజమాని ధైర్యం చేసి అక్రమ నిర్మాణానికి తెరలేపారు. దీనికి పరోక్షంగా స్థానిక వార్డు కౌన్సిలర్ తనయుడు కీలక పాత్ర పోషిస్తూ అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. సంగారెడ్డి జిల్లాకేంద్రంలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీ అయిన అధికారి ఈ స్థలానికి 58,59 జీవో ప్రకారం పాత తేదీల్లో క్రమబద్ధీకరణ చేసినట్లు సమాచారం బయటకు పొక్కింది. అందుకు మున్సిపల్ అధికారులు సైతం నకిలీ రసీదులతో అనుమతులు ఇచ్చినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. దీన్ని పూర్తిగా కౌన్సిలర్ కుమారుడు దగ్గరుండి నకిలీ పత్రాలు, క్రమబద్ధీకరణకు సంపూర్ణ సహకారం అందించారని ప్రచారం జరుగుతున్నది. లీగల్‌గా ఇబ్బందులు వస్తే తానే న్యాయవాదినని, ఏమైనా ఉంటే కోర్టులో చూసుకుంటానని కబ్జాదారులకు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### విచారణ చేసి చర్యలు తీసుకుంటాం..



బైపాస్ రోడ్డులోని 374 సర్వేనంబర్‌లో ప్రభు త్వ భూమిని అక్రమంగా కబ్జా చేసి పిల్లర్లు వేసేందుకు గుంతలు తీసిన విషయం మాదృష్టికి వచ్చింది. ఆర్‌ఐను పంపించి సమగ్ర విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల శిఖం భూములను పరిరక్షించేందుకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పట్టణంలో ఎవరైనా, ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేసి కటకటాలకు పంపిస్తాం.

**– దేవదాస్, తహసీల్దార్, సంగారెడ్డి**


## చిత్తశుద్ధి ఉంటే రెట్టింపు పరిహారం ఇవ్వాలి

### బీఆర్‌ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి


ఆనాడు రేవంత్‌రెడ్డి దీక్ష చేసిన ఫొటోలను చూపిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 22: సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన రూ.6లక్షల పరిహారాన్ని రెట్టింపు చేసి రూ.12లక్షలు ఇవ్వాలని, ఏటిగడ్డకిష్టాపూర్‌లో చేసిన నిరాహార దీక్షలో రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీని నెరవేర్చాలని బీఆర్‌ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిహారం అందజేసిందన్నారు. అబద్ధపు ప్రచారాలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు రెట్టింపు పరిహారం ఇవ్వడానికి ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిర్వాసితుల సమస్యలపై ఒక్కసారి కూడా రివ్యూ మీటింగ్ పెట్టలేదని, పెండింగ్ నిధులను విడుదల చేయడం లేదని, నిర్వాసిత గ్రామాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కొంతమంది కాంగ్రెస్ పార్టీ దుర్మార్గులు, బ్రోకర్లు మల్లన్నసాగర్ ప్రజలను మభ్యపెడుతూ రాజకీయలబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కపటప్రేమ చూపిస్తున్నారని వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. రాజకీయ లబ్ధికోసం వచ్చే కాంగ్రెస్ పార్టీ బ్రోకర్ల ఉచ్చులో ప్రజలు పడొద్దని హితవు పలికారు. 65 ఏండ్లు నిండిన వారికి ప్యాకేజీలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ప్యాకేజీలు ఆగాయని, వారికి ఇచ్చే సమయంలోపే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కోర్టు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం ధిక్కరిస్తున్నదని, మిగిలిన 65 ఏండ్లు నిండిన వారికి వెంటనే ప్యాకేజీలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజల పక్షాన నిలబడుతుందని,వారి పక్షాన పోరాడుతుందన్నారు. హైదరాబాద్‌లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, మూసీనదిలోని పేదల ఇండ్లను నిర్దాక్షిణంగా కూల్చారన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు కట్టించిన విధంగా మూసీ బాధితులకు ప్రభుత్వం అద్భుతమైన ఇండ్లను కట్టివ్వాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మూసీ బాధితులకు అద్భుత కాలనీ నిర్మాణం చేపట్టాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెండే మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు మెట్టయ్య, నాయకులు మల్లేశం, నరేశ్, అహ్మద్, కరీం, జోడు ప్రకాశ్, భిక్షపతి, కనకరాజు పాల్గొన్నారు.

## దవాఖానలో మగశిశువు లభ్యం


శిశువుకు అందుతున్న వైద్య చికిత్సలను పరిశీలిస్తున్న డాక్టర్ శాంతి

సిద్దిపేట, అక్టోబర్ 22 : సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఊయలలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మగ శిశువును వదిలి వెళ్లారు. గుర్తించిన దవాఖాన సిబ్బంది పైఅధికారులకు విషయాన్ని తెలియజేశారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి ఆదేశాల మేరకు నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో వైద్యుడు సురేశ్ బాబు ఆధ్వర్యంలో చిన్నారికి వైద్యం అందించారు. శిశువు 900 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి మాట్లాడుతూ.. పిల్లలు ఎవరైనా వద్దనుకుంటే దవాఖానలోని ఊయలలో, లేదా దవాఖాన సిబ్బందికి అప్పగించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బయట చెట్ల పొదల్లో, బహిరంగ ప్రదేశాల్లో వదిలిపెట్టవద్దని సూచించారు.

## ఐదుగురు ఏఈవోలపై సస్పెన్షన్ వేటు

సంగారెడ్డి,అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ఐదుగురు వ్యవసాయ విస్తరణ అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. పంటల బీమా పథకం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సస్పెండ్ చేసింది. అందోలు మండలంలోని డాకూరు క్లస్టర్ ఏఈవో శ్రీనివాస్, సదాశివపేట మండలం ఆత్మకూరు క్లస్టర్ ఏఈవో శ్రీదేవి, చౌటకూరు ఏఈవో దత్తురాజ్, చౌటకూరు మండలం కోర్పోల్ క్లస్టర్ ఏఈవో ప్రవీణ్, జిన్నారం మండలం సడాక్‌పల్లి క్లస్టర్ ఏఈవో దామోదర్‌ను సస్పెండ్ చేసింది. వ్యవసాయ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈవోల సస్పెన్షన్ వెనక సర్కారు కుట్ర దాగి ఉన్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే చేయమని చెప్పడంతోనే సస్పెండ్ చేసి మిగతా అధికారులను భయాందోళనకు గురిచేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆరోపించారు. ప్రభుత్వం ఏఈవోలను భయాందోళలనకు గురిచేసి డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయించాలని చూస్తోందని, ప్రభుత్వం తీరు సరైందిని కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సస్పెన్షన్లను ఎత్తివేయాలని రాష్ట్ర, జిల్లాస్థాయి ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 100మందికి పైగాఏఈవోలను సస్పెండ్ చేసినట్లు చెప్పారు. వ్యవసాయ విస్తీరణ అధికారు(ఏఈవో)లపై రోజురోజుకూ పని ఒత్తిడి పెరుగుతున్నది. సంగారెడ్డి జిల్లాలో 116 మంది ఏఈవోలు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల ఏఈవోలతో రుణమాఫీ, రైతుబీమాకు సంబంధించి గ్రామాల వారీగా సర్వే చేయించింది. గతనెల భారీ వర్షాలు, వరదల కారణంగా ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలు సేకరించారు. తాజాగా డిజిటల్ క్రాప్ సర్వే బాధ్యతలను అప్పగించింది. ఇది వరకే పని ఒత్తిడిలో ఉన్న తమకు డిజిటల్ క్రాప్ సర్వే బాధ్యతలు అప్పగించడంపై ఏఈవోలు ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వం వీరిని దారిలోకి తెచ్చుకునేందుకు సస్పెన్షన్ల కుట్రకు తెరలేపిందని ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## మత్స్యకారులను విస్మరించిన కాంగ్రెస్

### సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


సంగారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి, అక్టోబరు 22: చెరువులపై ఆధారపడి చేపలను పట్టుకుని జీవించే మత్స్యకారుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సారి విస్తారంగా వర్షాలు కురిసినప్పటికీ చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపపిల్లల విడుదలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్క సంగారెడ్డి నియోజకవర్గంలోని చెరువుల్లో 51,46,770 లక్షల చేపపిల్లలు వదిలి మత్స్యకారులకు చేయూతనిచ్చినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపపిల్లల పంపిణీపై ఇంకా స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జూలైలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి చేపపిల్లలను పంపిణీ చేయాల్సి ఉండగా, ప్రభుత్వానికి ప్లానింగ్ లేకుండా పోయిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో మత్స్యకారులు సంతోషంగా ఉన్నారని, కేసీఆర్ వారికి చేయూత ఇచ్చారన్నారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ అందరినీ మోసం చేస్తున్నదని చింతా ప్రభాకర్ విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, నాయకులు చిలువేరి మురళీ, దిడ్డి విఠల్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బతికుండగానే...సచ్చిండని పట్టామార్పు

### వర్గల్ తహసీల్ కార్యాలయం ఎదుట బాధిత కుటుంబీకుల ఆందోళన


వర్గల్ తహసీల్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న పోషయ్య కుటుంబీకులు

వర్గల్, అక్టోబర్ 22: బతికుండగానే సచ్చిండని వేరే వాళ్లపేరు మీద ఫౌతీ మార్పు చేసిన ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్‌లో వెలుగుచూసింది. బాధితుల వివరాల ప్రకారం..వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన ఉప్పరి పోషయ్యకు సర్వేనంబర్లు 642,645,647,659,661,690,712లో మొత్తం 36 గుంటల భూమి ఉంది. గ్రామానికి చెందిన మరో వ్యక్తి పోషయ్య చనిపోవడంతో రెవెన్యూ అధికారులు పంచనామా విషయంలో నిజనిర్ధారణ చేయకుండానే బతికున్న పోషయ్యకు చెందిన వ్యవసాయ భూమిని మరణించిన పోషయ్య కొడుకుల పేరుమీద చేశారు. ఆన్‌లైన్‌లో తన భూమి వివరాలు రాకపోవడంతో 2021 నుంచి తహసీల్ కార్యాలయం చుట్టూ ఉప్పరి పోచయ్య ప్రదక్షిణలు చేస్తున్నాడు. అధికారులు పట్టించుకోక పోవడమే కాకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. దీంతో విసుగు చెందిన పోషయ్య తన కుటుంబంతో సహా మంగళవారం వర్గల్ తహసీల్ కార్యాలయం వద్దకు వచ్చి పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపాడు. తన భూమిని ఇతరుల పేరు మీద ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నించాడు. అధికారులు స్పందించకుంటే కుటుంబంతో సహా పురుగులమందు తాగి చస్తానని హెచ్చరించాడు. ఈ ఘటనపై వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజ్ స్పందించారు. వేలూర్‌కు చెందిన ఉప్పరి పోషయ్య భూమి విషయం కలెక్టర్, ఆర్డీవోలకు నివేదన పంపుతానని, బాధిత కుటుంబీకుల లిఖిత పూర్వక ఫిర్యాదు ఆధారంగా గ్రామంలో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.